సాక్షి తిరుపతి

మంగళవారం : 16 : మే : 2023



పరిపూర్ణం.. బాలకాండ పారాయణం

తిరుమల నాదనీరాజనం వేదికపై 649 రోజుల నుంచి నిర్వహిస్తున్న అఖండ బాలకాండ పారాయణం సోమవారంతో ముగిసింది. -IVలో



ఆద్యంతం.. సందేశాత్మకం

గూడూరులో నిర్వహిస్తున్న జాతీయస్థాయి నాటక పోటీలు ఆకట్టుకుంటున్నాయి. ఆద్యంతం సందేశాత్మకంగా సాగుతున్నాయి. -IVలో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	41	27
చిత్తూరు	41	28
తిరుమల	37	24
గూడూరు	44	31
నగరి	43	29

న్యూస్‌రీల్

తిరుమలలో భక్తుల రద్దీ సాధారణం

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. 17 కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. ఆదివారం అర్ధరాత్రి వరకు సుమారు 87,022 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. 36,187 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. హుండీ ద్వారా రూ.3.40 కోట్ల ఆదాయం సమకూరింది. టైం స్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం అవుతోంది. దర్శన టికెట్లు లేనివారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

వినతుల పరిష్కారానికి ప్రాధాన్యం



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : ప్రజలు వివిధ సమస్యలపై స్పందనలో అందించిన వినతుల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు డీఆర్‌ఓ శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కోదండరామిరెడ్డి, శ్రీనివాసులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వినతుల్లో పేర్కొన్న సమస్యలను నిర్ణీత గడువులో పరిష్కరించాలని స్పష్టం చేశారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పందనలో మొత్తం 92 అర్జీలు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు.

ప్రశాంతంగా 'ఏపీ ఈఏపీసెట్'

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఏపీ ఈఏపీసెట్ సోమవారం తొలిరోజు ప్రశాంతంగా ముగిసింది. ఇంజినీరింగ్ విభాగంలో ఈ నెల 19వ తేదీ వరకు ఎంపీసీ విద్యార్థులకు, అగ్రికల్చర్, ఫార్మా విభాగాల్లో బైపీసీ విద్యార్థులకు 22, 23వ తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండు సెషన్స్‌లలో పరీక్ష జరగనున్నాయి. ఆఫ్‌లైన్ విధానంలో జరిగే ఈ పరీక్షకు తిరుపతి-3, పుత్తూరు-2, గూడూరు-3 మొత్తం 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. అందులో భాగంగా సోమవారం ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో 4,147మంది విద్యార్థులకుగాను 3,912 మంది హాజరయ్యారు. 235మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

స్వామి.. శివాంశ సంభూతుడు

హనుమజ్జయంతి వేడుకల్లో కుర్తాళం మఠాధిపతి



మాట్లాడుతున్న సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి

తిరుమల: ఆంజనేయస్వామి శివాంశ సంభూతుడని కుర్తాళం మఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి తెలిపారు. తిరుమలలో హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం నాదనీరాజనం వేదికపై స్వామీజీ అనుగ్రహ భాషణం చేశారు. సృష్టిలో రుద్ర శక్తిని మించింది లేదన్నారు. ఆంజనేయుని ఆరాధిస్తే బుద్ధి, బలం, ధైర్యం సిద్ధిస్తుందని వెల్లడించారు. అష్టాదశ పురాణాల్లోని శ్రీ వేంకటాచలమహత్యంలో స్పష్టంగా అంజనాద్రే హనుమ జన్మస్థలంగా చెప్పినట్టు తెలిపారు. అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు డాక్టర్ విభీషణ శర్మ మాట్లాడుతూ, అంజనాదేవి తపస్సు, వాయుదేవుని కటాక్షంతో హనుమంతుడు జన్మించినట్లు పురాణాల్లో పేర్కొన్నారని తెలిపారు.

సంప్రదాయం..
సారె సంబరం

- ఘనంగా గంగజాతర వేడుకలు
- సారె సమర్పించిన మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఆకట్టుకున్న కళాప్రదర్శనలు
- అమ్మవారి సేవకు పోటెత్తిన భక్తులు





గంగమ్మతల్లికి సారె సమర్పించిన మంత్రి అంబటి రాంబాబు దంపతులు, చిత్రంలో ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, సారె తీసుకువస్తున్న ఎంపీ గురుమూర్తి దంపతులు తదితరులు

సాక్షి, తిరుపతి : తాతయ్యగుంట గంగమ్మతల్లికి ఆరోరోజు సోమవారం పలువురు ప్రముఖులు సాంప్రదాయబద్ధంగా సారెలు సమర్పించారు. ముందుగా మంత్రి అంబటి రాంబాబు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తుడా కార్యాలయం నుంచి జానపద కళారూప ప్రదర్శనలు, భజనలు, కోలాటాలు, డప్పులు వాయిద్యాల మధ్య సారె ఊరేగింపు చేపట్టారు. ఆలయం వద్ద మంత్రి అంబటి రాంబాబుకు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ ఎమ్మెల్యే భూమన నేతృత్వంలో అద్భుతంగా గంగమ్మ జాతక సంబరాలు సాగుతున్నాయని కొనియాడారు.

గంగమ్మకు చెవిరెడ్డి పూజలు

ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి గంగమ్మకు సారెను సమర్పించారు. తుడా కార్యాలయం నుంచి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సారె తట్టలను తీసుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు.. ఆలయం వద్ద అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ గంగమ్మకు కుటుంబ సమేతంగా సారె సమర్పించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

మొక్కులు చెల్లించుకున్న ఎంపీ గురుమూర్తి

తాతయ్యగుంట గంగమ్మకు ఎంపీ గురుమూర్తి సారె సమర్పించారు. తన కార్యాలయం నుంచి శోభాయాత్రగా ఆలయానికి చేరుకున్నారు.

స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ..

స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ తమ కుటుంబ సభ్యులతో కలిసి గంగమ్మకు సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.





సారె సమర్పణలో కళాప్రదర్శనలు (ఇన్‌సెట్) సున్నపు కుండలతో కైకాల కులస్తులు

మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో..

ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ కమిటీ అధ్యక్షుడు గురువారెడ్డి, రూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి సారె సమర్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దొడ్డారెడ్డి శంకర్ రెడ్డి, దొరైరాజు పాల్గొన్నారు.

గంగమ్మ సేవలో జేసీ బాలాజీ



గంగమ్మతల్లికి జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ సాంప్రదాయ సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో డీటీలు అశోక్‌రెడ్డి, శ్యామ్, ఆర్ఐ రామచంద్ర, జానీబాషా పాల్గొన్నారు.

ఎస్ఈబీ అధికారులు..



తాతయ్యగుంట గంగమ్మకు ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ రాజేంద్ర, సూపరింటెండెంట్ స్వాతి ఆధ్వర్యంలో సారెను సమర్పించారు. కార్యక్రమంలో ఏఈఎస్ శ్రీనివాసులు, అర్బన్ సీఐ నాగరాజ రెడ్డి, అర్బన్ ఎస్ఐ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు..



కొత్తవీధిలోని ఆర్యవైశ్య సంఘ కార్యాలయం అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు ఊరేగింపుగా గంగమ్మ ఆలయానికి చేరుకుని సారె సమర్పించారు. ఆలయం వద్ద ఎమ్మెల్యే భూమన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కామిశెట్టి శ్రీధర్, హేమచంద్ర, వెంకటేష్ గుప్తా, సుకుమార్, సురేష్,మధు, రాము పాల్గొన్నారు.



సారెతో ఎమ్మెల్యే చెవిరెడ్డి తదితరులు



కళాకారులతో ఎమ్మెల్యే భూమన



ఆలయం వద్ద వివిధ ప్రదర్శనలు



సారె తీసుకువస్తున్న మహిళలు

జోరుగా... హుషారుగా!

- చంద్రగిరి ఐపీఎల్‌లో పరుగుల కిక్కు
- విజేతలకు బహుమతుల ప్రదానం
- పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ మెడల్స్
- పర్యవేక్షించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి



చంద్రగిరి ఐపీఎల్‌లో ఉత్కంఠగా సాగుతున్న మ్యాచ్



క్రికెట్ కిట్‌లను బహూకరిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా యువతకు క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో తలపెట్టిన చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో యువత పరుగుల కిక్కుకు తెరలేపారు. పలు గ్రామాల నుంచి క్రీడాకారులు జోరుగా...ఉషారుగా పోటీల్లో పాల్గొన్నారు. సోమవారం జరిగిన పోటీల్లో పలువురు క్రీడాకారులు పరుగుల ప్రవాహం సృషించారు. మరికొందరు పదునైన బౌలింగ్‌తో వికెట్లను సాధించారు.

13 గ్రౌండ్లలో 52 మ్యాచ్‌లు

మొదటి రోజు పోటీల్లో 13 గ్రౌండ్లలో 52 మ్యాచ్‌లను నిర్వహించారు. ఉదయం 8 గంటలకు, 11 గంటలకు, మధ్యాహ్నం 1 గంటలకు, సాయంత్రం 3 గంటలకు మ్యాచ్ లను ప్రారంభించారు. ఒక్కో గ్రౌండ్ నుంచి నాలుగు మ్యాచ్ ల చొప్పున 13 గ్రౌండ్లలో 52 మ్యాచ్‌లను నిర్వహించారు. తొలిరోజు పోటీల్లో ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు, ఆర్సీపురం మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. గెలిచిన వారికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మన్, బెస్ట్ ఆల్ రౌండర్‌కు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్క క్రీడాకారున్ని ప్రోత్సాహించేలా పార్టిసిపేట్ మెడల్, ధ్రువీకరణ పత్రాన్ని అందించారు.



విజేతలకు మెడల్స్, ప్రశంసాపత్రాలను అందిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

నిపుణులైన అంపైర్లతో పర్యవేక్షణ

క్రికెట్ టోర్నీలో క్రీడాకారుల మధ్య విభేదాలు రాకుండా పూర్తిస్థాయి శిక్షణ పొందిన అంపైర్లతో పర్యవేక్షణ చేయిస్తున్నారు. అంపైర్లదే తుది నిర్ణయం కావడంతో ఎక్కడా క్రీడాకారులు అసొకర్యానికి గురికావడంలేదు. మ్యాచ్ ప్రారంభం నుంచి పూర్తి స్థాయిలో స్వేచ్ఛగా ఆటను ఆడుతూ తమ ప్రతిభను కనబరిచారు.

క్షణక్షణం పర్యవేక్షణ

వైఎస్ఆర్ క్రీడా మైదానంలో ప్రారంభమైన మ్యాచ్‌లను ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి క్షణక్షణం పర్యవేక్షించారు. చాలా మంది క్రీడాకారులు ఎమ్మెల్యేతో సెల్ఫీలు దిగారు. అలాగే చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేతులు మీదగా క్రికెట్ కిట్లు తీసుకున్న క్రీడాకారులు ఆనందడోలికల్లో మునిగితేలారు. మ్యాచ్‌ల ప్రారంభ సమయంలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ప్రతి ఒక్క క్రీడాకారునికీ టీ షర్ట్‌లను పంపిణీ చేశారు.



టూవీలర్‌పై మ్యాచ్‌ల నిర్వహణను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

నేడు మత్స్యకారులకు 'భరోసా'

- 3647 మందికి రూ.3.64 కోట్లు
- నాలుగో విడత వేట పరిహారం పంపిణీ



గుమ్మళ్లదిబ్బ తీరంలో నిలిపి ఉన్న బోట్లు

చిల్లకూరు : వేట విరామ సమయంలో మత్స్యకారుల జీవనోపాధికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. సుమారు 61 రోజులపాటు సముద్రానికి దూరంగా ఉండనున్న నేపథ్యంలో ఏటా పరిహారం పంపిణీ చేస్తోంది. మంగళవారం ఈ మేరకు నిజాపట్నం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగో విడత మత్స్యకార భరోసా పథకం కింద లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు. తిరుపతి కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహించనున్నారు.

జిల్లాలో ఇలా..

తిరుపతి జిల్లాలో సుమారు 75 కిలోమీటర్ల మేర సముద్రతీర ప్రాంతం ఉంది. చిల్లకూరు, కోట, వాకాడు, తడ మండలాల్లోని 29 గ్రామాల్లోని సుమారు 3,647 మంది మత్స్యకారులు చేపల వేటతోనే జీవనం సాగిస్తున్నారు. సముద్రంలో మత్స్య సంపద పెంపుదల కోసం ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు వేట విరామం పాటిస్తుంటారు. ఈ సమయంలో మత్స్యకారులకు పోషణకు ప్రభుత్వం సహకారం అందిస్తోంది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మత్స్యకారులకు రూ.4వేల చొప్పున పరిహారం అందించేవారు. అదికూడా రెండేళ్లకు ఒకసారి మంజూరు చేసేవారు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏటా వేట విరామం ముగియక ముందే రూ.10వేల చొప్పున పరిహారం అందిస్తున్నారు.

క్రమం తప్పకుండా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఏటా క్రమం తప్పకుండా మత్స్యకార భరోసా అందిస్తున్నారు. సముద్రం మీద వేటకు వెళ్లే ప్రతి మత్స్యకారుడికీ పరిహారం పంపిణీ చేస్తున్నారు.
– కోడి నరసింహులు, మత్స్యకారుడు, మోమిడి, చిల్లకూరు మండలం

సంతోషంగా ఉంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకార భరోసాను రూ.10 వేలు చేస్తున్నట్లు ప్రకటించారు. అదే ఏడాది వేట విరామం సమయంలోనే పరిహారం అందించారు. నేరుగా మా ఖాతాల్లోనే నగదు జమ చేస్తుండడం సంతోషంగా ఉంది. – వెంకటేశ్వర్లు, మత్స్యకారుడు, తూపిలిపాళెం, వాకాడు మండలం

ఈకేవైసీ లేనివారికి రెండో విడత



అర్హులైన మత్స్యకారులందరికీ పరిహారం కింద రూ.10వేల చొప్పున అందిస్తున్నాం. ఇప్పుడు నాలుగో విడత నగదు పంపిణీ చేస్తున్నాం. ఈకేవైసీ పూర్తికాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారికి కూడా రెండో విడతలో పరిహారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. – శ్రీనివాసనాయక్, జిల్లా మత్స్యశాఖాధికారి

పకడ్బందీగా పోషకాహారం పంపిణీ

పకడ్బందీగా పోషకాహారం పంపిణీ



సమావేశంలోమాట్లాడుతున్న కలెక్టర్

తిరుపతి అర్బన్ : వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని సక్రమంగా అమలుచేయాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారంమహిళా శిశు సంక్షేమశాఖ సీడీపీఓలు, సూపర్‌వైజర్లతో సమీక్షించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అంగన్‌వాడీ ద్వారా అందచేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలపై పర్యవేక్షణ, తరచూ సమీక్షలు చేయాలని, సంబంధిత సీడీపీఓలు, సూపర్‌వైజర్లు గృహ సందర్శనలు నిర్వహించాలని చెప్పారు. పిల్లల ఆధార్ సీడింగ్ వేగవంతం చేయాలన్నారు. పనితీరు మెరుగుపడకపోతే సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారిణి జయలక్ష్మి, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు హాజరయ్యారు.

కండలేరు డ్యాం పరిశీలన

రాపూరు: మండలంలోని కండలేరు జలాశయాన్ని డ్యాం సేఫ్టీ కమిటీ బృందం (మెకానికల్ అడ్వజరీ కమిటీ బృందం)ఁ పరిశీలించింది. కండలేరు సమీపంలోని స్పిల్‌వే, హెడ్‌రెగ్యులేటర్ గేట్లు, లోలెవల్ స్లూయిస్, పవర్‌ప్లాంట్ గేట్లను బృందం పరిశీలించింది. ఈ బృందంలో కమిటీ చీఫ్ రిటైర్ సీఈ సత్యనారాయణ, సభ్యులు రవిప్రకాష్, జనార్దన్, సుధాకర్, స్థానిక ఇంజినీర్లు తిరుమలయ్య, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

అండర్-19 జూడో జిల్లా జట్ల ఎంపిక



అండర్19 జిల్లా జట్లకు ఎంపికైన విద్యార్థులు

నాయుడుపేట : పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం అండర్-19 జూడో జిల్లా జట్లను ఎంపిక చేశారు. జూడో సంఘం జిల్లా కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపికైన బాలబాలికల జట్లు బుధవారం నుంచి అనంతపురంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో రెజ్లింగ్ వైస్ ప్రెసిడెంట్ సుధీప్ రెడ్డి, డాక్టర్ వెంకటరత్నం, కోచ్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

అత్యుత్తమ వైద్య సేవలకు కృషిచేయండి



అధికారులకు సూచనలు చేస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

తిరుపతి తుడా : స్విమ్స్‌ని అత్యుత్తమ వైద్యసంస్థగా తీర్చిదిద్దేందుకు వైద్యులు, సిబ్బంది కృషిచేయాలని టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగాలపై జేఈవో సదాభార్గవితో కలిసి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ స్విమ్స్ అభివృద్ధికి టీటీడీ సంపూర్ణ సహకారం అందిస్తోందన్నారు. ఆస్పత్రిని అత్యున్నతస్థితికి తీసుకురావాలంటే వైద్యుల సేవలు కీలకమన్నారు. ఆస్పత్రికి అవసరమైన వైద్యపరికరాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఆయా విభాగాల అభివృద్ధికి పలు సూచనలు చేశారు. ఈ సమీక్షలో స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ, టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, పీఆర్వో రవి, ఐటీ జనరల్ మేనేజర్ సందీప్, వైద్యాధికారులు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ అలోక్‌సచం, డాక్టర్ జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మండే ఎండ!



జిల్లా నిప్పుల కొలిమిలా మారింది.. భానుడి భగభగ బెంబేలెత్తిస్తోంది.. రోజురోజుకూ ఉష్ణోగ్రత పెరిగిపోతోంది.. సోమవారం దాదాపు 43.2 నుంచి 44 డిగ్రీల వరకు నమోదైంది.. దీంతోపాటు వడగాల్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.. తీవ్రమైన ఉక్కపోతతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.. బయటకు వచ్చేందుకే భయపడిపోతున్నారు.. ఉదయం 10 గంటలకే వీధులు నిర్మానుష్యంగా మారిపోతున్నాయి.. మరో నాలుగైదురోజులపాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశముందని వాతావరణశాఖ నివేదికలు వెల్లడిస్తున్నాయి.

- నిప్పుల కొలిమిలా జిల్లా
- మూడు రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదు
- వడగాల్పులతో జనం ఉక్కిరిబిక్కిరి

తిరుపతి తుడా : రోహిణి కార్తెలో రోళ్లు సైతం పగులుతాయన్న నానుడిని ఎండలు నిజం చేస్తున్నాయి. ఉదయం 7 గంటలకే సూర్యుడి ప్రతాపం మొదలవుతోంది. 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. 6 దాటినా ఎండ తీవ్రత తగ్గడం లేదు. వాతావరణంలో మార్పుల కారణంగా వడగాల్పులు అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆ మేరకు తిరుపతి జిల్లాలో ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇళ్లలో ఉండలేని పరిస్థితితో నానా అవస్థలు పడుతున్నారు. రాత్రి 12 గంటల వరకు ఆపసోపాలు పడుతున్నారు.

అప్రమత్తత అవసరం



అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తగిన జాగ్రత్తలతోనే రోడ్లపైకి రావాలి. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. తగిన మోతాదులో నీరు తాగించాలి. ద్రవ పదార్థాలను ఎక్కువ మోతాదులో తీసుకోవాలి. వడదెబ్బకు గురి కాకుండా చూసుకోవాలి. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం సమయంలో బయట తిరగకపోవడం మంచిది. గొడుగు వినియోగించడం శ్రేయస్కరం., ద్విచక్రవాహనదారులు కళ్లజోళ్లు, టోపీలను తప్పనిసరిగా ధరించాలి. – డాక్టర్ యువ అన్వేష్‌రెడ్డి, ఆర్ఎంఓ, రుయా ఆస్పత్రి

చిరు వ్యాపారులపై అధిక ప్రభావం

రోడ్లు, ఫుట్‌పాత్‌లు, తట్ట వ్యాపారులపై మండే ఎండల ప్రభావం అధికంగా పడింది. 11 గంటలకే ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండడంతో వ్యాపారం చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. కొందరు పొట్టకూటి కోసం మండుటెండలోనే వ్యాపారం చేసుకుంటుండగా, ఎక్కువశాతం మంది ఉదయం 11 తర్వాత రోడ్లపై కనిపించడం లేదు. సాయంత్రం 5 గంటల తర్వాతే మళ్లీ వ్యాపారం మొదలుపెట్టుకుంటున్నారు.

ఉష్ణోగ్రతల సమాచారం

శుక్రవారం : 41
శనివారం : 38.1
ఆదివారం : 42
సోమవారం : 43.2–44



తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.63,240
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,679
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,800
రిటైల్ వెండి గ్రాము	రూ.76.80

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి

చిట్టమూరు: మండలంలోని కోతలగుంటలో సోమవారం ట్రాక్టర్ కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. ఈశ్వరవాక పంచాయతీ కోతలగుంట గ్రామానికి చెందిన బసవనూరు జనార్దన్(42) ట్రాక్టర్‌ను పొలం గట్టు ఎక్కిస్తుండగా బోల్తా పడింది. అదుపుతప్పిన జనార్దన్ జారి ట్రాక్టర్ కిందపడిపోయాడు. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించగా, అప్పటికే జనార్దన్ మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

రైలు పట్టాలపై మృతదేహం

రేణిగుంట : వెదుళ్లచెరువు సమీపంలో రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని జీఆర్పీ పోలీసులు సోమవారం గుర్తించారు. మృతుడికి సుమారు 50 ఏళ్లు ఉంటాయని, రైల్లో నుంచి జారి పడి ఉండవచ్చని పోలీసులు తెలిపారు.

పరిపూర్ణం.. బాలకాండ పారాయణం



అఖండ పారాయణంలో వేదపండితులు

- 649 రోజులు.. 2,232 శ్లోకాలు
- నేడు సుందరకాండ.. రేపటి నుంచి అయోధ్య కాండ

తిరుమల: లోకకల్యాణార్థం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమల నాదనీరాజనం వేదికపై 2021 జులై 25న ప్రారంభించిన బాలకాండ పారాయణం సోమవారంతో పరిపూర్ణమైంది. తిరుమల ధర్మగిరి వేద వి/జ్ఞానపీఠం ప్రిన్సిపల్ కుప్పా శివసుబ్రమణ్య అవధాని మాట్లాడుతూ బాలకాండలోని మొత్తం 77 సర్గల్లో 2,232 శ్లోకాలను 649 రోజులపాటు పారాయణం చేశామన్నారు. ప్రతి శ్లోకానికి అర్థం, పరమార్థాలను విశ్లేషిస్తూ పండితులు వ్యాఖ్యానం అందించారని వివరించారు. శ్రీవారు, బేడి ఆంజనేయస్వామి సమక్షంలో బాలకాండ పారాయణం చేయడం గొప్ప విషయమన్నారు. రామనామ స్మరణ ఉన్నచోట హనుమంతుడు ఉంటారని వాల్మీకి మహర్షి తెలియజేశారని, ఆవిధంగా ఇన్నిరోజులు స్వామి మనమధ్యే ఉన్నారని వెల్లడించారు. పారాయణం చేసిన ఎస్వీ వేద విశ్వవిద్యాలయం అధ్యాపకులు ప్రవరామకృష్ణ సోమయాజులు, ధర్మగిరి వేదవి/జ్ఞానపీఠం పండితులు రామానుజచార్యులు, మారుతి, శేషాచార్యులతోపాటు ఈ కార్యక్రమాన్ని కోట్లాది మంది భక్తులకు చేరువ చేసిన ఎస్వీబీసీ సీఈఓ షణ్ముఖ కుమార్‌కు, అద్భుతమైన కీర్తనలు ఆలపించిన అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం పండితులను, కళాకారులను ఘనంగా సత్కరించారు. ఈ క్రమంలో మంగళవారం తిరుమల ధర్మగిరి వేద పాఠశాలలో సంపూర్ణ సుందరకాండ అఖండ పారాయణం చేపట్టనున్నారు. ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు 67 మంది పండితులు ఈ యజ్ఞంలో పాలుపంచుకోనున్నారు. అలాగే బుధవారం నుంచి తిరుమల నాదనీరాజనం వేదికపై అయోధ్య కాండ పారాయణం ప్రారంభించనున్నారు. మొత్తం 4,308 శ్లోకాలను పారాయణం చేయనున్నారు. ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది.

అభిమాన నీరాజనం


- ఘనంగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు
- పెద్దసంఖ్యలో హాజరైన శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలు
- జనసంద్రాన్ని తలపించిన ప్రధానవీధులు
- లక్షమందికి పైగా భోజన సౌకర్యం



ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

రేణిగుంట: ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు సోమవారం శ్రీకాళహస్తిలో అట్టహాసంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీ శ్రేణులు, మహిళలు, అభిమానులు తండోపతండాలుగా తరలి వచ్చి ఎమ్మెల్యేకు దీవెనలు అందించారు. పట్టణంలోని బేరివారి మండపం వద్ద నిర్వహించిన సంబరాలోల ముందుగా ముక్కంటి ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో వేదపండితులు ఎమ్మెల్యేకు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం విశేష సంఖ్యలో హాజరైన ప్రజలు తమ అభిమాన నేతకు శుభాకాంక్షలు తెలిపేందుకు బారులు తీరారు. కొందరు నాయకులు, కార్యకర్తలు నోటు పుస్తకాలు, విద్యా సామగ్రిని అందించి అభినందనలు తెలిపారు. ఈ క్రమంలో పట్టణంలోని ప్రధాన వీధులు జనంతో కిక్కిరిసి పోయాయి. అలాగే నెల్లూరు విజయా కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ జీఎల్ అన్నపూర్ణ, విజయకుమార్ దంపతులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని బియ్యపు పవిత్రారెడ్డి ప్రారంభించగా, తొట్టంబేడు మండల అధ్యక్షుడు ఉన్నం వాసునాయుడు పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యే ఇంటి వద్ద నుంచి బయలుదేరి అర్ధనారీశ్వరుని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ సీడ్స్ కూడలి వద్ద భగత్‌సింగ్ ఆటో కార్మికులు గజమాలతో ఎమ్మెల్యేను సత్కరించారు. పేద మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే జన్మదినోత్సవానికి సుమారు లక్ష మందికి పైగా హాజరయ్యారు. వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సభా ప్రాంగణంలో తాగునీరు, మజ్జిగ, కూలర్లు, ఫ్యాన్లు, కుర్చీలు వేశారు. ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖుల్లో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, నగరి నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పిల్లలకు పోటీ పరీక్షలు అవసరం



డాక్టర్ ఎస్.విశ్వనాథరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : పిల్లలకు పోటీ పరీక్షలు అవసరమని, ఈ మేరకు వారిని సన్నద్ధం చేయాలని విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎస్.విశ్వనాథరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్షలు రాసేలా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలన్నారు. సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్లో క్రమశిక్షణతో కూడిన చక్కని విద్యనందించి పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తారని వెల్లడించారు. 33ఏళ్ల తమ సంస్థ ప్రస్థానంలో ఎందరో విద్యార్థులకు పోటీ పరీక్షల్లో శిక్షణ అందించి జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. ఇసమాచారం కోసం 93999 76999, 86888 88802 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆద్యంతం.. సందేశాత్మకం

– ఆకట్టుకుంటున్న నాటక పోటీలు



అతీతం నాటికలో ఓ సన్నివేశం..

గూడూరు : పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్ ఓపెన్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి నాటికలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సంస్కృతి సమ్మేళనం ఆధ్వర్యంలో సాగుతున్న ఈ పోటీల్లో సోమవారం రాత్రి ప్రదర్శించిన ''అతీతం, '' రైతేరాజు'' అనే నాటికలు ఆద్యంతం సందేశాత్మకంగా సాగాయి. గుంటూరుకు చెందిన అభినయ ఆర్ట్స్ వారు మొదట ప్రదర్శించిన అతీతం నాటిక ద్వారా గ్లోబలైజేషన్ ద్వారా జరగుతున్న నష్టాలను వివరించారు. భారతీయ కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాలని కోరారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన కళాంజలి వారు ప్రదర్శించిన ''రైతేరాజు'' నాటికలో జవాన్లు, రైతులు లేకుంటే దేశంలో ఎవరూ సుఖ శాంతులతో జీవించలేరనే సందేశాన్ని అందించారు. రైతులు తమకు అవసరమైన ధాన్యాన్నే పండించుకుంటే పరిస్థితులు ఎలా తయారవుతాయో ఆలోచింపజేసేలా ఈ నాటకం సాగింది. ప్రదర్శనలకు ముఖ్య అతిథులుగా సంస్కృతి సమ్మేళనం అధ్యక్షుడు కనుమూరు హరిచంద్రారెడ్డి, నాటక విభాగ వ్యవహారకర్త జానా శివయ్య, కార్యదర్శి మునిగిరీష్, జనార్ధన్, నాగేశ్వరరావు, వి.మల్లికార్జునరావు పాల్గొన్నారు.